


**జాజికి ప్రొద్దున్నించి భయం భయంగా వుంది. హైదరాబాదులో యిన్ని రోజులు ఎంతో సరదాగా గడచిపోయాయి. ఈ రోజే భయం, ఆరాటం, కంగారు మొదలైనాయి.**

జాజి, ఇంద్ర పెళ్ళి అయి రెండేళ్ళుగా సంసారం సాగిస్తున్న దంపతులు. రెండు పేర్లూ మన తెలుగు పేర్లలా లేకపోయినా అసలు సిసలు ఆంధ్రులే.

జాజి తల్లిదండ్రులు జాజి పుట్టినపుడు కూర్గు ప్రాంతంలో వుండటం, వాళ్ళకి తెలిసిన ఒక అందాల కూర్గు వనిత పేరు జాజి కావటం, పేరు పెట్టటం జరిగింది. ఇంద్ర పుట్టి పెరిగింది కలకత్తాలో. ఇంతకీ ఈ క్రొత్తదంపతులు వుంటున్నది బెంగుళూరులో.. కన్నడ రాజ్యలక్ష్మి ముద్దుబిడ్డలైపోయారు.

జాజికి టైమ్ జరిగే కొద్దీ కంగారూ పెరగసాగింది. అన్యమనస్కంగా స్నానం చేసి పూజ చేసుకొంది. ఆంధ్రుల ఆడపిల్లే అయినా భక్తితో, ఆచారవంతంగా, నమ్మిన దేవుడిని కొలవటం కన్నడిగుల వల్లే అలవాటైంది ఆ పిల్లకి. కన్నడ ప్రజలలాగా మాట మాటకి "దేవస్థానం"కి వెళ్ళి దేవుడిని అర్చించటం మరీ అలవాటు.

"దేవరా! నీవే నాకు దిక్కు"అనుకొంది దీనంగా, గద్గద స్వరంతో. "ఈ గండం ఎలా గడుస్తుందో అర్థం కావడం లేదు. త్వమేవ శరణం మమదేవదేవ" అనుకొంది భక్తిగా.

"జాజీ! నీపేరుకి తగ్గట్టే అమాయకంగా, స్వచ్ఛంగా, ముగ్ధలా వుంటావు" అని అందరూ అంటూంటారు. 'ఈ అమాయకత్వమే ఈ రోజు కొంపమీదకి తెచ్చేట్లు వుంది'అనుకొంది విసుగ్గా. సర్దిందే సర్దుతూ కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా తిరిగింది.

"ఏమిటీ, ఇంత చదువులు చదివి కూడా ప్రతిదానికీ కంగారు"—వాళ్ళమ్మ విసుక్కుంది.

"లేదమ్మా, ఏమైనా మరిచిపోయానేమోనని చూసుకొంటున్నా."

"పాపా! ఎంతో ప్రౌడ్‌గా పెంచామనుకొన్నాం, ఆమాత్రం చొరవ లేకపోతే ఎలాగ?" తండ్రి మోడరన్‌గా బాధపడిపోయారు.

"దాని పూజలు, చాదస్తం చూస్తూ కూడా అట్లా అనుకొంటారేమిటి నాన్నగారూ! ఇది అసలు మన పిల్ల కాదు. బిసీబేళేబాత్ మరిగిన పిరికిపిల్ల" అన్నగారి వేళాకోళం.

వీళ్ళ విసుగు, బాధ, వేళాకోళం ఏవీ

జాజికి ధైర్యాన్ని యివ్వలేకపోతున్నాయి. మనసులో బాధని తేలిక చేయటంలేదు. నాన్న గారికి సెలవు వుండి వుంటే. కనీసం అన్నయ్యకు క్రికెట్ మేచ్ లేకపోయినా తోడువచ్చి వుండేవారు. పండగ అవగానే ఆయనతో వెళ్ళిపోయినా సరిపోయేది. పోస్టు గ్రాడ్యుయేట్ అయివుండికూడా ప్రతీదానికి పిరికితనమే. ఏ పనికీ ప్రక్కన తోడు వుండాల్సిందే. చదువు సంస్కారాన్ని యిస్తుందేగానీ ధైర్యాన్ని ఇవ్వదు అని వ్రాసిపెట్టుకొంది మనసులో. ఈ ఆలోచనలతో మెదడు కేన్సర్ ఫుండులాగా తయారైంది.

"సంభవామి యుగే । యుగే ।"

"పరమాత్మా! ఏ దుష్టులనూ నా జోలికి రాకుండా కాపాడు." "మనసులో మంత్రోచ్ఛారణ లాగా అనుకొంటూనే వుంది. "యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారతా!" వచ్చిన ఒక శ్లోకం తిరిగి తిరిగి మననం చేసుకొంటూ వుంది.

"ఓం నమో భగవతే వాసుదేవాయ...." దేవుడికి నమస్కరించుకొంటూనే వుంది. ఈ ధ్యానమే కాస్త మనశ్శాంతినిస్తుంది అనుకొంది. బెంగుళూరు వెళ్ళాక రోజూ మెడిటేషన్ చేసి మనసుమీద కంట్రోల్ తెచ్చుకోవాలి అనుకొంది.

"నీ కంటే నీ మనసుకి శిక్షణ యిచ్చుకోవాలి జాజీ"—స్నేహితురాలి మాట గుర్తు వచ్చింది. కళ్ళల్లో నీళ్ళు వూరాయి. ఆ స్నేహితురాలే పుట్టపర్తినించి జీప్‌లో వస్తూ బందిపోటు దొంగలు రాయి విసరగా చనిపోయింది. సోషియాలజీ చదవటంతో ప్రతి వాళ్ళ ప్రవర్తన నిశితంగా విమర్శించటం, చెడుని చూసి భయపడటం అలవాటైపోయింది.

'ఒకరైలు ప్రయాణం గురించి యింతగా మధనపడటం, భయపడటం ఏమిటి? ఏం జరుగుతుంది? మహా అయితే చచ్చిపోతాం, అంతేగా' అని ధైర్యం చెప్పుకొంది.

ధైర్యం కూడగట్టుకుని భోంచేసి మంచం ఎక్కింది. గట్టిగా కళ్ళు మూసుకుని నిద్రకి ప్రయత్నం చేసి లాభంలేక వంట గదిలోకి వెళ్ళింది. కూతురు ప్రయాణానికి పూరీ కుర్మ, జంతికలు, వెన్నుండలు తయారు చేస్తూ చాలా హడావిడిలో వున్నారు శాంతి గారు.

"అమ్మా, నువ్వెప్పుడు వస్తావు బెంగుళూరు" తల్లి ప్రక్కన కూర్చుంటూ అడిగింది.

"వీలున్నప్పుడు వస్తాను. మునుపు నిన్ను కాపరానికి దిగబెట్టినపుడు అన్నీ చూసాననుకో. ఈసారి బేలూరు, శ్రావణ బెళగోళ వెళదాం."

"అమ్మా! శ్రావణ బెళగోళలో నువ్వెక్కలేవుగానీ మద్రాసు వెళదాం. శిల్ప పెళ్ళి దగ్గరకొచ్చింది కదా, పట్టుచీరలు తీసుకొందాం" తల్లిదగ్గర గారాలు పోయింది.

"పాపా, మూడైపోయింది. రెడీయేనా?" తండ్రి కంగారు చూసి గబగబా డ్రెస్ మార్చుకొని తయారైంది. 'అప్పుడే మూడైపోయిందా!' మనసు బాధగా మూల్గింది.

తండ్రి, అన్నయ్యలతో కాచిగూడా స్టేషను చేరేసరికి మూడుంబావు అయింది. కాసేపటలో ట్రైను రానే వచ్చింది. 'లేడీస్ కాబిన్‌లో బుక్ చెసుకొన్నాపోయేది. అక్కడ మరీ భయం అంటూ భయపెట్టేశారు' అనుకొంటూ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్ళింది. అప్పటికే సీటుచూసి కూలీ తెచ్చిన సామాను సర్దిపెట్టేశాడు పవన్. కళ్ళనీళ్ళతో దీనంగా వస్తున్న చెల్లెల్ని చూసి జాలిపడ్డాడు.




నీడల్లో నిజాలు

ఇద్దరు జంటల్నీ, ఒక మగమనిషిని చూసి తేరుకొంది జాజి.

'రాత్రి కళ్ళు మూసుకొని పడుకొంటే ఏడుగంటలకల్లా బెంగుళూరులో వుంటాను' అనుకొంది.

తండ్రి, అన్నయ్యలు జాగ్రత్తలు చెప్పి వీడ్కోలు యిస్తూ దిగిపోయారు. ట్రైన్ బయలుదేరింది.

జంటల వైపు చూసింది. మొగుళ్ళతో కబుర్లలో డీప్‌గా మునిగిపోయి వున్నారు ఆడవాళ్ళు. అతని వైపు చూసింది. 'ప్రమాదకరమైన మనిషి లాగా లేడులే ఏంటీ అట్లా వెర్రినాగులోడి లాగా వున్నాడు' అనుకొంది.

అతనే పలకరించాడు.

"బెంగుళూరేనా?"

"ఔనండీ."

"హైదరాబాదా మీది? నాది మదరాసు. అరవ్వాళ్ళం. తెలుగు కొంజెంగా వస్తుంది"

ఆ మీట, గొత్తు, రండా, అపురూపము లాంటి కన్నడ తెలుగుకంటే బాగానే వుంది ఈ అరవ తెలుగు అనుకొంది.

"శంకరాభరణం చూస్తిరా? ప్రేమ లేకుంటే ఎందుకండీ ఆ యమ్మ లాస్ట్‌లో చచ్చిపోయేదీ" ప్రశ్నిస్తున్నాడు అతను.

జాజి ఏమిటో ఈ సంభాషణతో వెగటుగా ఫీలయింది. 'ఏమిటి ఇతని చొరవ!' సన్నగా అణిచిపెట్టి వుంచిన భయం మొదలైంది. నిస్సహాయంగా మిగిలినవారివైపు చూసింది. ఆడంగులు మొహం తిప్పుకొన్నారు.

"వీళ్ళ మొగుళ్ళని మింగేస్తాననిభయం" తిట్టుకొంది. ఇంతలో అతను లేచి టాయిలెట్ వైపుకి వెళ్ళాడు.

"అతనితో మాట్లాడకమ్మా. సికింద్రాబాద్‌లో ఎక్కిన దగ్గర్నించీ వాగుతూనే వున్నాడు" జంటల్లో ఒకతను అన్నాడు.

తల వూపి వూరుకొంది.

రానే వచ్చాడు మహానుభావుడు.

"మీరు మైసూర్ అయ్యంగార్లను కొన్నాను. లేదా మళయాళీ కావచ్చు నను కొన్నా."

మెదలకుండా కూర్చుంది.

"నేను జాస్తిగా మాట్లాడలేను. నన్ను ఆరు నెలల కింద పిచ్చికుక్క కరిచింది. ఇంజక్షన్లు తీసుకొంటే ఏదో రియాక్షన్ వచ్చింది."

బాబోయ్! పిచ్చికుక్క!

"ఏం రియాక్షనండీ" ఆసక్తిగా అడిగింది జాజి. ఇక అతను కుక్క ఎట్లా కరిచింది, ఎక్కడ కరిచింది, ఎన్ని ఇంజక్షన్లు తీసుకొంది, ఒంటికి నిలిచిపోయింది అని ఒకటే ధోరణిగా చెప్పటం మొదలుపెట్టాడు.

కొంచెం మెంటల్ కేస్ లాగున్నాడు అను

కొంటూ అతను చెప్పేది వినకుండా అటు తిరిగి కూర్చుంది.

అతను జాలిగా చూస్తూ మాటలు ఆపేశాడు.

పాపం అనిపించింది. కాసేపు స్టార్‌డస్ట్ చదివింది. కాసేపు బయటకు చూస్తూ కూర్చుంది. ఇలా కాదనుకొని తెచ్చుకొంది తిన్నది. అందరూ కూడా తిని బెర్త్‌లు అరేంజ్ చేసుకోవటం మొదలుపెట్టారు. తనూ బెర్త్ ఎక్కి పడుకొంది. ఇతను అర్ధరాత్రి ఏ చెయ్యో పట్టుకుంటే ఎంత అప్రదిష్ట అనుకొంటూ కళ్ళు మూసుకొంది. ఉయ్యాల లాగా వూగుతూ స్పీడ్‌గా వెళ్తోంది వెంకటాద్రి. కాసేపు రైల్ చేసే చప్పుడు వింటూ ఆలోచనలు ఏకోన్ముఖం చేయటానికి ప్రయత్నించింది. ఆ తర్వాత నిద్ర. రాత్రంతా పీడ కలలే. అతను నవ్వుతూ, జాలిగా చూస్తూ, మేదకుడిలాగా వాగుతూ, రాక్షసుడిలాగా వికటాట్టహాసం చేస్తూ ఎన్ని రూపాలలో కన్పించాడో.

ఈ కలల మధ్య స్ట్రగుల్ అవుతూండగానే తెల్లవారింది. మెలకువ తెచ్చుకొని బెర్త్ దిగింది. 'అమ్మయ్య, ఇంకో గంటలో బెంగుళూరు వచ్చేస్తుంది...'

పేరు తెలియని అతను అప్పటికే లేచి వెర్రిగా చూస్తూ కూర్చుని వున్నాడు. మొహం కడుక్కొచ్చేసరికి అందరూ లేచి వున్నారు.

"నేను కాఫీ త్రాగానండీ. మిమ్మల్ని లేపుదామంటే మీరు నరక లోకంలో వున్నారండీ" అతని పలకరింపు.

"బాబోయ్! మీ తెలుగు....నరక లోకం కాదండీ. స్వప్న లోకంలో" అంటూ పక్కాయన విరగబడి నవ్వుతున్నాడు.

జాబికి నవ్వు రాలేదు. జాలేసింది.

'ఈ ప్రమాదంలేని సగం పిచ్చివాడి గురించి ఎన్ని ఆలోచించింది!'

సిటీస్టేషన్ రానే వచ్చింది.

ఇంద్ర వెతుక్కొంటూ వస్తున్నాడు.

"ఏమిటీ! బయాబాదేరే ముందు జ్వరం గాని వచ్చిందా?" పీక్కుపోయిన భార్య మొహం చూస్తూ అడిగాడు.

"లేదు లెండి. అలసట."

స్టేషన్ బయటకు నడిచారు ఆ ఇద్దరూ ఆనందంగా, త్రుళ్ళుతూ, నవ్వుకొంటూ.

వర్షం కురిసి వెలిసినట్లుంది. ఆకాశంలో ఇంద్రధనుస్సు రంగు లీనుతూవుంది. ●

SILENT MOVIE
HOME CINEMA PROJECTOR
Price Rs. 150/-



For detailed Catalogue book send Postage Stamps or M. O. for Rs. 2-50. Please write only in English.

Film Company
Post Box No. 269,
SIVAKASI-626123, Tamilnad

ఏపిపి ఎస్‌సి గ్రూప్ II

అందరికీ నిశ్చయంగా ఫలితాలనిచ్చే శిక్షణ.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ సహకారంతో ఎస్‌సి & ఎస్‌టి అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ. ఇతర ప్రాంతాల ఎస్‌సి & ఎస్‌టి అభ్యర్థులు నెలవారీ మెయింటినెన్స్ అలవెన్సు పొందవచ్చు.

కోర్స్ డైరెక్టర్ : ఎల్. పాండురంగారెడ్డి

ఆసక్తి ఉంటే రు. 5/- పంపండి.

సోల్జర్స్ స్కాలర్స్ స్టడీ సర్కిల్

9-ఫుట్‌బాల్ స్టేడియం, ఫతే మైదాన్, హైదరాబాద్-500 001.

2/16, బ్రాడీపేట, గుంటూరు వద్ద బ్రాంచి

జనరల్ స్టడీస్ కొరకు ప్రజ్ఞ చదవండి

అసూయ, స్వార్థం కల
వ్యక్తితో జీవితం ఇరుకుపడితే
ప్రేమ అనేది ఒక 'ఊబి!'
సహృదయం, సంస్కారం
గల మనిషితో బ్రతుకు కలిస్తే
అది ఒక 'దీపిక!'

ఈ రెండింటి సచిత్ర రూపకల్పనే
యద్దనపూడి సులోచనారాణి
తాజా డైరెక్టు నవల

ప్రేమదీపిక
వెల: రూ. 15-లే
మీ దగ్గరలో వున్న పుస్తక విక్రేతను అడగండి. లేకుంటే తెప్పించి పెట్టమనండి.
వీలుకాదంటే...
రూ. 5-లు ఎమ్.వో చేస్తే రూ. 10-లకి వి.పి. పెట్టి పంపిస్తాము.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
3237 రాష్ట్రపతి రోడ్
సికింద్రాబాద్. 500 003